తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 07 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:250 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు..

## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..



విచారణ మూడు వారాల వాయిదా!

**స్పీకర్ నిర్ణయం సానుకూలంగా ఉండాలని ధర్మాసనం స్పష్టీకరణ...**

గడువు కోరిన సింఘ్వీ.. ధిక్కారణ పిటిషన్ పైనా విచారణకు కోర్టు గ్రీన్ సిగ్నల్..

2లో

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన


## కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి సాయం

**ప్రమోద్ భార్య ప్రణీతకు చెక్కు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**నిజామాబాద్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

గతేడాది విధి నిర్వహణలో దుండగుల కత్తిపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 1 కోటి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 'ప్రజా పాలన - ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ సహాయాన్ని అందజేశారు.

మిగతా 2లో..





# నిజామాబాద్‌లో అభివృద్ధి పనులకు భారీ ఊతం



**రూ.600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు సీఎం శంకుస్థాపన**

నిజామాబాద్ వ్యవసాయం దేశానికే ఆదర్శం

ప్రజాపాలన—ప్రగతి బాట సభలో ప్రసంగం

**నిజామాబాద్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ స్కూళ్ల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మిగతా 2లో..

## 'కరీంనగర్‌లో కాంగ్రెస్ చేతులెత్తేసింది'



**కరీంనగర్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతులెత్తేసింవదని ఎద్దేవా చేశారు కేంద్ర మంత్రి , బీజేపీ ఎంపీ బండి సంజయ్. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓడిపోతుందనే తెలిసే సీఎం రేవంత్ ఇక్కడకు రాకుండా పారిపోయారన్నారు.

మిగతా 2లో..



## రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడొద్దు: కేటీఆర్ పిలుపు

ప్రజా సమస్యలపైనే సమరం చేయాలి

కాంగ్రెస్ వైఫల్యాలు, హామీల మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలి

2లో



బీసీ రిజర్వేషన్లపై కవిత

## సంచలన వ్యాఖ్యలు

**కేటీఆర్, హరీష్ రావులపై సంచలన వ్యాఖ్యలు..**

**రేవంత్ రెడ్డి తీరుపై ధ్వజం**

బీఆర్ఎస్ బీ-ఫామ్స్ కేటాయింపుపై అభ్యంతరం..

ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై చర్యలకు డిమాండ్..

2లో



## జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు
- ఓట్లతోనే రాజకీయ సమాధానం ఇవ్వాలన్న పిలుపు
- కార్యకర్తలే నా బలం అంటూ స్పష్టం
- భావోద్వేగంగా స్పందించిన మాజీ మంత్రి

2లో

## 'తులం బంగారం ఏది? 4 వేల పెన్షన్ ఎక్కడ?'

- ఫ్రీ బస్సు పేరుతో మోసం..పురుషుల ఛార్జీలు డబుల్ చేశారని ఆరోపణ
- రెండేళ్ల తర్వాత మళ్ళీ వచ్చేది కేసీఆర్ సర్కారేనన్న మాజీ మంత్రి.
- రేవంత్ రెడ్డి పాలనపై హరీశ్ రావు ఫైర్

2లో



## హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

భట్టి విక్రమార్క



- నగర అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయింపు
- 27 పట్టణ స్థానిక సంస్థల జీహెచ్‌ఎంసీలో విలీనం
- హెచ్-సిటి ప్రోగ్రామ్‌తో ఫ్లైఓవర్లు, రహదారుల విస్తరణ
- పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఈ దిశగా గత రెండు సంవత్సరాల్లోనే రికార్డు స్థాయిలో రూ. 20,000 కోట్లను నగర అభివృద్ధికి కేటాయించామని తెలిపారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీసీ రిజర్వేషన్లపై కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

బీసీ రిజర్వేషన్ల జీవోపై కోర్టులో కేసు వేసిన బుట్టింగారి మాధవరెడ్డికి మూడు చింతలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫాం ఇవ్వడాన్ని జాగృతి తెలంగాణ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. బంజారా హిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో బీసీల పట్ల బీఆర్ఎస్ వైఖరిని ఆమె ప్రశ్నించారు. మాధవరెడ్డితో కేసు వేయించింది బీఆర్ఎస్ పార్టీయేనా? దీనిపై పార్టీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాధవరెడ్డి హరీష్ రావుకు సన్నిహితుడని పేర్కొంటూ, ఇలాంటి వ్యక్తులకు కేటీఆర్ ఓటు వేయమంటారా? అని కవిత ప్రశ్నించారు. మాధవరెడ్డి మొదట జాగృతిలో పని చేసి, ఆ తర్వాత తన సామాజిక వర్గం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేసుకున్నారన్నారు. బీసీల కోసం బీఆర్ఎస్ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని, బీసీల పట్ల ఆ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉందా లేదా ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక కార్యక్రమాలను ఎన్నికల ప్రచారానికి చకచకగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇంత స్పష్టమైన అధికార దుర్వినియోగం జరుగుతున్నా బీఆర్ఎస్ కనీసం స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. జాగృతి తరఫున గతంలోనూ, నిన్న కూడా ఫిర్యాదు చేశామని, సీఎస్కు లేఖ రాస్తామని ఎన్ఈసీ చెప్పిందని కవిత తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరికీ ఒక చరిత్ర ఉందని, కేసీఆర్ చరిత్ర ఒక పుస్తకమైతే, ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకే రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపి వేయలేరని స్పష్టం చేశారు.

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేటు వేయాలని మాజీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. గాంధీ బీఆర్ఎస్‌లో ఉన్నానని చెబుతూనే నిజామాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా ఎలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని అన్నారు.

సిరిసిల్లలో 17 మంది ఇండిపెండెంట్లు, ఫార్వర్డ్ బ్లాక్ పోటీలో ఉన్నారని గుర్తు చేశారు. అయినా కేటీఆర్ అక్కడికే పరిమితమై ప్రచారం చేయడం వెనుక కారణాలేమిటో ప్రజలు ఆలోచించాలన్నారు. కృష్ణఅర్జునుల్లా రాష్ట్రం అంతా బీఆర్ఎస్ నేతలు ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. హరీష్ రావుకు తాను పెట్టిన 'గుంట నక్క' అనే పేరు పూర్తిగా సరిపోతుందన్నారు. ఊరికే పేర్లు పెట్టనని, ఆయన్ను ఆ పేరుతోనే సంబోధిస్తానని వ్యాఖ్యానించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదేశాలు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చిన చిన్న చేప ప్రణీత్ రావుపై చర్యలు తీసుకోవడం సరికాదని కవిత అన్నారు. ఈ నెల 12న ఆర్టీసీ కళాభవన్‌లో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో ఈరోజు జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు.

అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా (సానుకూలంగా) ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడొద్దు: కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పన్నుతున్న 'తిట్ల ట్రాప్'లో ఎవరూ పడవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల వేళ తన ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో జరిగిన మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి తిట్ల రాజకీయాన్ని తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక వికృత రాజకీయ క్రీడ నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ సాధన కోసం పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటం చేసి, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించిన నాయకుడు కె. చంద్రశేఖర్ రావు అని కేటీఆర్ గుర్తు చేశారు. తండ్రిలా రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పాడుబడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్ గారని కొనియాడారు. కేసీఆర్ ఎప్పుడూ బిరుదులు, సన్మానాల కోసం పాకులాడలేదని, తెలంగాణ ప్రజల శ్రేయస్సే ఆయనకు నిజమైన గౌరవమని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికార గర్వంతో రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని దాచిపెట్టేందుకు కేసీఆర్ వ్యక్తిత్వంపై విషం చిమ్ముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ఒక వ్యక్తిపై మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమ చరిత్రపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. అందుకే పార్టీ శ్రేణులు ఎవరూ ఈ 'తిట్ల ట్రాప్'లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చర్చ జరగాల్సింది వార్డుల మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ అందాల్సిన పథకాలపై కావాలని కేటీఆర్ అన్నారు. కానీ రేవంత్ రెడ్డి తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల కన్నీటిని తుడిచే దిశగా బీఆర్ఎస్ పోరాటం సాగాలని, అబద్ధపు ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

ఎరువుల కోసం క్యూ లైన్లలో రైతులు పడుతున్న కష్టాలు, రైతు భరోసా అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతిలో నలుగుతున్న అన్నదాతల పరిస్థితిపై గొంతెత్తాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగిపోతున్న విద్యార్థుల వేదనకు, గురుకులాల్లో విషాహారం తిని అల్లాడుతున్న పిల్లల పరిస్థితికి రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని ప్రశ్నించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, డీఏలు, పీఆర్సీ లేక నలిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిలబడాలని కేటీఆర్ కోరారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రజలకు వివరించాలని, నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి 'కోవర్టు' ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజల తీర్పే కేసీఆర్‌కు ఇచ్చే అసలైన గౌరవమని, పదేళ్ల ఉజ్వల ప్రగతి తర్వాత ఈ రెండేళ్లలో తెలంగాణ ఎదుర్కొంటున్న దుర్గతికి కారణాలను ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఒక ధ్రువతార అని, ఆయన కీర్తి ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుందని అన్నారు. చివరగా, రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందామని కేటీఆర్ తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు.

## ..కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి సాయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రమోద్ భార్య ప్రణీత గారికి రూ. 1 కోటి చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రమోద్ త్యాగం ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసే పోలీస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. ఇలాంటి ఘటనల్లో బాధిత కుటుంబాలకు తక్షణమే సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

- గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ అధికారులతో జూమ్ సమీక్ష
- విద్యార్థుల సన్నద్ధతకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి
- ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచన

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల పాఠశాలల విద్యార్థుల సన్నద్ధతపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్న జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, గురుకులాల కార్యదర్శి సైదులు, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అకడమిక్ మద్దతు, ప్రత్యేక తరగతులు, రివిజన్ ప్లాన్‌లు అమలు చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉపాధ్యాయులకు స్పష్టంగా సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, బలహీన అంశాలను గుర్తించి వ్యక్తిగత శిక్షణ అందించాలని చెప్పారు. గురుకులాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ, పరీక్షలపై ధైర్యం కలిగించేలా కౌన్సెలింగ్, ప్రోత్సాహం అందించాలని, హాస్టళ్లలో చదువుకు అనుకూల వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

## నిజామాబాద్ లో అభివృద్ధి పనులకు భారీ ఊతం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆయన... తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. ఈ సందర్భంగా ఇందూరు జిల్లా మహిళా సమాఖ్యకు చెందిన 1,614 స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును సీఎం అందజేశారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి మారుపేరని, ఇక్కడి రైతులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి, అవసరమైన అదనపు నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి నూటికి నూరు శాతం ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ యూనివర్సిటీ, డిచ్‌పల్లిలో రూ.20 కోట్లతో ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్ల నిర్మాణం, ఇందల్‌వాయిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది నివాస గృహాలు, అదనపు సౌకర్యాల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీలో రూ.8.60 కోట్లతో బాలికల హాస్టల్, రూ.1.36 కోట్లతో ఇండోర్ స్టేడియం, రూ.43 కోట్లతో ఆడిటోరియం, పరిపాలనా భవనం, సీఎస్ఈ భవనాల విస్తరణ పనులు, రూ.18 కోట్లతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవం చేశారు.

ఇదే విధంగా రూ.21 కోట్ల వ్యయంతో గాంధీనగర్-బినోలా, పీడబ్ల్యూడీ & జేఎన్ఎన్ రోడ్డు-సిరన్‌పల్లి-నిజాంపూర్ మార్గాల్లో రోడ్ల వెడల్పు పనులు చేపట్టనున్నారు. ఈ సభలో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## 'తులం బంగారం ఏది? 4 వేల పెన్షన్ ఎక్కడ?'

- రేవంత్ రెడ్డి పాలనపై హరీశ్ రావు ఫైర్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ బాధిత కుటుంబాలకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. 'సిగాచి ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని ఛాలెంజ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మరుసటి రోజు మాత్రమే సీఎం వచ్చారన్నారు. కంపెనీ రూ.25 లక్షలు ఇచ్చినా.. రేవంత్ ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు.

అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను గుర్తుచేస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పెన్షన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని బాండ్ పేపర్‌పై రాసిచ్చినా అమలు కాలేదన్నారు. కళ్యాణ లక్ష్మి కోసం కేసీఆర్ ఇచ్చిన లక్షా 116 రూపాయల కంటే రేవంత్ తులం బంగారం అదనంగా ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫ్రీ బస్సు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని.. పురుషుల బస్సు ఛార్జీలను డబుల్ చేశారని విమర్శించారు. ఇస్నాపూర్‌లో గత రెండేళ్లలో గజం రోడ్డు కూడా వేయలేదని, చిన్న డ్రైనేజీ కూడా కట్టలేదన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలను కాపాడారని హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ లేని లోటు ఇప్పుడు అందరికీ తెలుస్తోందన్నారు. పనులు ఎవరు చేస్తారో గమనించి ఓటు వేయాలని హరీశ్ సూచించారు. బీజేపీని కార్మికులు, పేదల వ్యతిరేక పార్టీ అని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ సీఎం అన్న విషయాన్ని మర్చిపోయి ఏదేదో మాట్లాడుతున్నారని.. సీఎం మాట్లాడే భాష తగినది కాదన్నారు. కేసీఆర్‌ను బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను జైలుకు పంపాలని చెబుతున్నారని విమర్శించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎంగా, తాను మంత్రిగా వస్తానన్నారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో డబ్బులు పంచితే తీసుకోవాలని.. ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని ప్రజలను మాజీ మంత్రి హరీశ్ రావు కోరారు.

కాగా.. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పర్యటించిన హరీశ్ రావు.. అక్కడి మహిళలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మహిళలతో ముచ్చటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని అన్నారని ఆరోపించిన జీవన్ రెడ్డి, తాను మాత్రం ప్రజాస్వామ్య మార్గంలో ఓట్లతోనే కొడదామని చెబుతున్నానని వ్యాఖ్యానించారు. తన గొంతును కోద్దామని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, తనను అణిచివేయాలంటే ముందు భుజాల్లాంటి తన కార్యకర్తలను దాటి రావాలని సవాల్ విసిరారు. కార్యకర్తలే తన అసలైన బలమని, వారి అండతోనే రాజకీయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన జీవన్ రెడ్డి, "జీవితం ముగిసేలోపు నాకు తీవ్ర దుఃఖం మిగిల్చారు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై జరుగుతున్న రాజకీయ దాడులు వ్యక్తిగతంగా బాధిస్తున్నాయని అన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలే తుది తీర్పు చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదని, ఎన్నికల ద్వారా సమాధానం ఇవ్వడమే సరైన మార్గమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ద్వారా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో సమగ్ర ప్రణాళికతో కూడిన సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఈ నిర్ణయ లక్ష్యమని తెలిపారు. హెచ్‌సిటి కార్యక్రమం ద్వారా రూ. 7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నగర రవాణా సౌకర్యాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా కేవలం మౌలిక సదుపాయాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ, మెరుగైన జీవన ప్రమాణాలకు పెద్దపీట వేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా, అత్యంత నివసించదగిన నగరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## 'కరీంనగర్‌లో కాంగ్రెస్ చేతులెత్తేసింది'

(మొదటి పేజీ తరువాయి)

ఈరోజు (శుక్రవారం, ఫిబ్రవరి 6వ తేదీ) కరీంనగర్ 10, 11 డివిజన్ల ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ ప్రసంగించారు.

ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుంది. ఎంఐఎంకు మేయర్ పదవి ఆఫర్ చేశారు. కేంద్రం నిధులిస్తే.. మేమే తెచ్చామనడానికి కాంగ్రెస్ నేతలకు సిగ్గు లేదా?, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి? , ఢిల్లీ నుండి గల్లీకి నిధులు తెచ్చే దమ్ము బీజేపీకే ఉంది' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.



## అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **ఈ నెల 9 నుండి ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించాలి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -06 (తెలంగాణ ముచ్చట్లు)**

సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.
ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారి నకు సమర్పించాలన్నారు.
యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుండి సమర్పించాలని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రాధిక చౌరస్తాలో చిన్నారుల ట్రాఫిక్ అవగాహన

- **గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**కాప్రా, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా సర్కిల్ రాధిక చౌరస్తాలో గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులతో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ లింగారెడ్డి, ఏఎస్ఐ నర్సింలు సహా ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చిన్నారుల చేత ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాధాన్యతను వివరింపజేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి, రోడ్డు దాటేటప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా వారు ఎదుగుతారని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. చిన్నారుల పాల్గొనడంతో నిర్వహించిన ఈ కార్యక్రమం రాధిక చౌరస్తాలో వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి. శేషు కుమారి, పి.పి.టి ఇంచార్జ్ శ్వేతా రెడ్డి, ఉపాధ్యాయులు అశ్విని, రష్మీ, సహాన, ఉషా, కోమల్, జితేందర్, నరేష్, పీఈటీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## వడ్డెర సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా గోగుల ఆది

**మధిర నియోజకవర్గ వడ్డెర సంఘం కార్యదర్శిగా గోగుల వెంకన్న**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**

శుక్రవారం వడ్డెర సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ వల్లపు సోమరాజు మరియు ఖమ్మం నియోజకవర్గం అధ్యక్షులు కుంచపు కుమార్ ఆధ్వర్యంలో జరిగింది సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వల్లెపు సోమరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర యవతకు ఉపాధి కల్పన కోసం వడ్డెర కార్పొరేషన్ ద్వారా 70% సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి జేసిపిలు, క్వారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు
అదేవిధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో గత ఉమ్మడి రాష్ట్రంలో వడ్డెర సొసైటీలకు 15% రిజర్వేషన్ లు ఉండేవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారని ఆయన అన్నారు రాబోయే రోజుల్లో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామంలో ఉన్న వడ్డెర సొసైటీలకు రెండు కోట్ల రూపాయల రుణాలను ఇవ్వాలనే డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లపు సోమరాజు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, ఖమ్మం జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు కుంచపు కుమార్, వీరబాబు, ఎం రాము, వి సాయి, కిరణ్, హనుమంతు, వీరబాబు సన్నీ తదితరులు పాల్గొన్నారు

# రంగు రంగుల కండువాల 'సొల్లు పురాణం' నమ్మొద్దు!

- **పదేళ్లు పాలించి 'పట్టా' ఇవ్వని దొరలు.. ఇప్పుడు ఓట్ల కోసం వస్తారా?**
- **అధికారం మనది.. అభివృద్ధి చేసేది మనమే..**
- **ప్రతిపక్షాల మాయమాటలపై మంత్రి పొంగులేటి నిప్పులు**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6(తెలంగాణ ముచ్చట్లు)**



"ఎన్నికలు రాగానే చుట్టాల్లా వస్తారు.. రంగు రంగుల కండువాలు మార్చి మాయమాటలు చెబుతారు.. పదేళ్లు అధికారంలో ఉండి పేద ప్రజలకు రేషన్ కార్డు ఇవ్వాలన్న జ్ఞానం లేని ఆ 'దొర'లు, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు?" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాల్వంచలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యర్థుల వైఫల్యాలను ఎండగడుతూ వ్యాఖ్యలు చేశారు.

**కత్తి ఒకరికిచ్చి.. యుద్ధం చేయమంటే కుదురుతుందా?**

"రాష్ట్రంలో ఉన్నది ప్రజా ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రిగా మీ శీనన్న మీ వారు. కత్తి ఒకరి చేతికి ఇచ్చి, యుద్ధం నన్ను చేయమంటే నేను చేయలేను. ప్రభుత్వం మనదైనప్పుడే అభివృద్ధి సాధ్యం. ఓట్ల కోసం వచ్చే రకరకాల వ్యక్తుల 'సొల్లు పురాణం' నమ్మకండి. అధికారం లేని వారికి ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతుంది. హస్తం గుర్తును గెలిపిస్తేనే మీ సమస్యలు తీర్చే బాధ్యత నేను తీసుకుంటాను.

**పదేళ్ల అన్యాయానికి చరమగీతం పాడుదాం**

"పదేళ్లుగా నా పేద చెల్లెమ్మలు ఇందిరమ్మ ఇళ్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశారు. ఆనాడు పట్టించుకోని వారు, నేడు మీ ముందుకు వస్తున్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జిలు, అస్తవ్యస్తమైన రోడ్లే వారి అసమర్థతకు సాక్ష్యం. సర్వే నంబర్ 727 భూ సమస్యను ఏళ్ల తరబడి ఎందుకు గాలికొదిలేశారు? మీ ఇంటి పెద్ద కొడుకుగా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, సాగులో ఉన్న ప్రతి నిరుపేదకు పట్టా ఇచ్చే బాధ్యత నాది."

**మాయ మాటలకి కాలం చెల్లింది**

"రంగులు మార్చే నాయకులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. 25 ఏళ్లుగా ఎన్నికల్లేక వెనుకబడ్డ పాల్వంచకు నిధుల ప్రవాహం రావాలన్నా, ఇళ్ల పట్టాలు అందాలన్నా కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షమైన సీపీఎం పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

# మాయమాటలు, మోసపు మాటలతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది

- **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6(తెలంగాణ ముచ్చట్లు)**





మాయమాటలు, మోసపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఖమ్మం మాజీ ఎంపీ, మాజీ బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామ నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి లతో కలిసి వైరా 5వ వార్డు బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి కట్టా స్వరూప రాణి, 6వ వార్డు సీపీఎం అభ్యర్థి మాదినేని రజిని, 12వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి మాదినేని సునీత గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు అమలు సాధ్యం కాని ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ నాయకులు మోసం చేశారన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ. 2500, పెన్షన్లు రూ. 4000, దివ్యాంగులకు రూ.6000 చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడ లేని విధంగా ఆడబిడ్డల పెళ్లికి 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాల కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించామని, దానికి తులం బంగారం కలిపి ఇస్తామని కాంగ్రెస్ చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పిందన్నారు. రైతులు, యువత, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తాగునీరు, సాగునీరు, విద్యుత్ కోతలు లాంటి సమస్యలు లేకుండా చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారని గుర్తుచేశారు. ఆ విషయాన్ని టీడీపీ శ్రేణులు గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అనేక చోట్ల టీడీపీ శ్రేణులు తమతో కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు. కేసీఆర్ పాలనలోనే వైరా మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.

# సమాజమే ఆవిష్కరించబడాలి

- **క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ క్యాలెండర్ ఆవిష్కరణలో ఆర్.పి.వి ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 06(తెలంగాణ ముచ్చట్లు)**





మూర్ఖత్వపు పరిమళాలు వెదజల్లబడుతున్న ఈ కాలంలో సమాజమే ఆవిష్కరించబడాల్సిన అవసరం ఉందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్.పి.వి) ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. శుక్రవారం నిజాంపేటలో క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంపై ఉద్దేశపూర్వక దాడులు జరిగినప్పుడు ఆ సమాజంలోని సభ్యులు ప్రతిఘటించకపోతే కాలక్రమేణా అదే సమాజం అంతమైపోతుందని హెచ్చరించారు. అందుకే రాజ్యాంగ విలువల ఆధారంగా సమాజం మళ్లీ ఆవిష్కరించబడాలని పిలుపునిచ్చారు.
సమాజం మారాలంటే ముందుగా మన ఆలోచనలు మారాలని, మార్పు చట్టాలతో కంటే చైతన్యంతోనే వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, అసమానతలను ఖండించే స్వరం, మానవత్వాన్ని నిలబెట్టే సంకల్పం ప్రతి ఒక్కరిలో వెలిగినప్పుడే నిజమైన పరివర్తన మొదలవుతుందని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు కాదని; గౌరవం, సమానత్వం, అవకాశాల సమన్వయమే సార్థక అభివృద్ధి అని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి-ఈ మూడింటిపై సమాజం సమానంగా నిలబడినప్పుడే ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఐక్యత బలపడుతుందని సాదిక్ అలీ అన్నారు. నిన్నటి తప్పులను సరిదిద్దుకుంటూ, నేటి బాధ్యతను స్వీకరిస్తూ, రేపటి తరాలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. వ్యక్తి మారితే కుటుంబం, కుటుంబం మారితే గ్రామం, గ్రామం మారితే దేశం—అలా మార్పు చక్రం తిరగాలన్నారు. అందుకే 'సమాజమే ఆవిష్కరించబడాలి' అన్న సందేశాన్ని పునరుద్ఘాటించారు.
ఈ కార్యక్రమంలో ఆర్ పి వి నిజాంపేట విభాగానికి చెందిన నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నిజాంపేట అధ్యక్షులు డా. ఖిజరుల్లా, కార్యదర్శి మొహమ్మద్ అహ్మద్ (మున్నా), సలహాదారు హబీబ్, మాజీ కార్పొరేటర్ మజీద్, డా. ఫయాజ్, రజీయుద్దీన్, జహూర్, మౌలాలి, మహబూబ్, ముజఫ్ఫర్, మహబూబ్ అలీ, అబ్దుల్ నబీ, షఫీక్, ఇల్లియాస్, ఇమామ్, ఆజం తదితరులు పాల్గొన్నారు. సమాజంలో రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో ఆర్ పి వి పాత్ర కీలకమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని వారు ఆకాంక్షించారు.

# గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి నాది!

- **ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి**
- **బీఆర్ఎస్ పాలనపై ధ్వజం.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**



"గత పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే కనీస జ్ఞానం కూడా ఆనాటి 'దొర'కు లేకపోయింది. కానీ మా ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత నాది. మీరు అభ్యర్థులను గెలిపించండి.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటాను" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీలోని 1,21,19,18,31,32,17,14,16వ వార్డుల్లో ఆయన విస్తృతంగా రోడ్ షో నిర్వహించారు.

**మాయ మాటలు నమ్మొద్దు..**

రెడ్డిపల్లి (1వ వార్డు) నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో ముత్తగూడెం, గొల్లగూడెం, బారుగూడెం మీదుగా ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు రాగానే రంగు రంగుల కండువాలు వేసుకుని మాయ మాటలు చెప్పేందుకు వస్తారు. గతంలో 'వరి వేస్తే ఉరి' అని రైతులను భయపెట్టిన వారు నేడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటోందని గుర్తు చేశారు.

**సొంతింటి కల నెరవేరుస్తాం..**

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీలో మొదటి విడత కింద ఇప్పటికే 587 ఇళ్లు మంజూరు చేశామని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రెండో విడత జాబితాను విడుదల చేస్తామని ప్రకటించారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు స్థలాలు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు.

**హోరెత్తిన రోడ్ షో..**

మంత్రి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా, పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి, నినాదాలతో హోరెత్తించారు. ఆయా వార్డుల అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు: ఫిబ్రవరి 11న స్థానిక సెలవు

- **ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ మను చౌదరి పిలుపు**

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి 11వ తేదీన స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ మున్సిపాలిటీల పరిధిలోని ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణాలు, పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని సంబంధిత యాజమాన్యాలను ఆయన కోరారు. తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988, ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1974 నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 11న ఉద్యోగులకు తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుని మౌలిక హక్కు కావడంతో ప్రతి ఓటరు తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 30వార్డులో ప్రత్యర్థులకు శిరీ"షాక్"!

- ఏదులాపురంలో ముగిసిన విపక్షాల కథ.. కాంగ్రెస్‌లోకి క్యూ
- మంత్రి పొంగులేటి సమక్షంలో 'చేయి' కలిపిన తప్పెట్ల గిడ్డన్ (మున్నా)
- బీఆర్ఎస్, సిపిఐ పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి 40 కుటుంబాలు
- శిరీషా రెడ్డి దూకుడుతో ప్రతిపక్షాలకు ముచ్చెమటలు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6(తెలంగాణ ముచ్చట్లు ):** ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో అప్పుడే ఫలితం తేలిపోయిందా? అంటే అవుననే అంటున్నాయి 30వ వార్డు రాజకీయ పరిణామాలు. కాంగ్రెస్ అభ్యర్థిని కొట్టం శిరీషా రెడ్డి ప్రత్యర్థులకు ఊహించని విధంగా "షాక్" ఇచ్చారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీలను ఖాళీ చేస్తూ, వార్డులో తన విజయకేతనాన్ని



ఖాయం చేసుకుంటున్నారు.

**మంత్రి సమక్షంలో భారీ చేరికలు**

శుక్రవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం కీలక రాజకీయ మార్పుకు వేదికైంది. బీఆర్ఎస్ కీలక నేత తప్పెట్ల గిడ్డన్ (మున్నా) ఆధ్వర్యంలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, సుమారు 40 కుటుంబాలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. స్వయంగా మంత్రి పొంగులేటి వారికి కండువాలు కప్పి ఆహ్వానించడంతో వార్డులో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

**గెలుపు ముంగిట శిరీషా రెడ్డి**

ఒకేసారి 40 కుటుంబాలు పార్టీలో చేరడంతో 30వ వార్డులో విపక్షాలు డీలా పడ్డాయి. అభ్యర్థిని శిరీషా రెడ్డి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుండటంతో ప్రత్యర్థులకు పాలుపోని పరిస్థితి నెలకొంది. "అభివృద్ధికి ఆకర్షితులయ్యే తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామని, శిరీషా రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని" ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టం శిరీషా రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్మశాన వాటికను వైకుంఠధారణగా తీర్చిదిద్దుతున్నాం

- కార్పొరేటర్ శాంతి సాయిజెన్

**నాచారం, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలోని రెడ్డి సంఘానికి చెందిన రెడ్డి స్మశాన వాటికను వైకుంఠధారణగా అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ తెలిపారు. రూ.58 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ రెడ్డి సంఘం నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే, స్మశాన వాటికలో ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాలు ఏవైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని రెడ్డి సంఘం నాయకులను కోరారు. అవసరమైతే అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈ ఉమామహేశ్వరి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం, కల్లు దుకాణాల మూసివేత

- పోలింగ్, కౌంటింగ్ పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలపై నిషేధం

**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఈ నెల 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలో మద్యం, కల్లు దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పోలింగ్ తేదీకి 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత ప్రాంతాల్లో మద్యం, కల్లు విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని సూచించారు.నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కలెక్టర్, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత యాజమాన్యాలు, అధికారులు ఎన్నికల నిర్వహణకు పూర్తి సహకారం అందించాలని తెలిపారు.





## విశ్వ బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ స్థల పరిశీలన

- నాగారం గ్రామంలోని సర్వే నం.574న స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**మేడ్చల్ – మల్కాజ్గిరి , ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కీసర మండలంలోని నాగారం గ్రామంలో విశ్వ బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు.

నాగారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 574లో ఉన్న స్థలాన్ని కీసర తహసీల్దారు యాదగిరి రెడ్డితో కలిసి అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. భవన నిర్మాణానికి సంబంధించిన భూమి స్థితిగతులు, హద్దులు, ప్రభుత్వ నిబంధనల అంశాలపై అధికారులతో చర్చించారు .ఈ పరిశీలన కార్యక్రమంలో సర్వేయర్ వినయ్ కుమార్, ఆర్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## మల్లాపూర్ డివిజన్‌లో రూ.3.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**మల్లాపూర్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా మొత్తం రూ.3 కోట్ల 74 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పలుచోట్ల ప్రారంభించిన అభివృద్ధి పనుల వివరాలు ఇలా ఉన్నాయి. శక్తిసాయి నగర్, దత్తాత్రేయ నగర్, గోకుల్ నగర్, సూర్యనగర్ కాలనీల్లో రూ.156 లక్షలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.





అలాగే భవాని నగర్, ఎస్వీ నగర్, కెఎల్ రెడ్డి నగర్, అన్నపూర్ణ కాలనీల్లో రూ.140 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు. బ్రహ్మపురి కాలనీ, మల్లాపూర్, మల్లికార్జున్ నగర్, బాబానగర్ కాలనీల్లో రూ.78 లక్షలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి కాలనీలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని అన్నారు.కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షణ చేస్తామని పేర్కొన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో జిహెచ్ఎంసీ నాచారం సర్కిల్ డీఈ ఉమామహేశ్వరి, ఏఈ సూరజ్, స్పందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రెడ్డి కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధి లోని రెడ్డి కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. రెడ్డి కాలనీలో జైలు పరిధి నుంచి ఎన్ఓసీ వచ్చేలా ప్రత్యేకంగా చొరవ తీసుకుని, స్టామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల కోసం రూ.1 కోటి 26 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు కాలనీ వాసులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి కాలనీలో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్థానికులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో కాలనీకి సంబంధించిన తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి తగి న సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.రెడ్డి కాలనీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కాలనీ వాసులు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## సుందరకాండ పారాయణంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధి లోని చర్లపల్లి గ్రామంలో శ్రీరామ భక్తితో ద్వదిన సుందరకాండ పారాయణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సుందరకాండ పారాయణం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సమాజంలో సద్భావన పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి ఐక్యతను బలపరుస్తాయని అన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామస్మరణతో గ్రామాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. రెండు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అలియాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో ఈటల రాజేందర్ రోడ్‌షో

**మేడ్చల్–మల్కాజిగిరి , ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు)** మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఆయనను ఘనంగా స్వాగతించారు.యాదారం గ్రామంలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం, ఈటల పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళలతో ముచ్చటించి వారి సమస్యలపై సమీక్ష చేశారు. "మా ఇల్లు పక్కనే ఉంది. ఎప్పుడైనా రావచ్చు. ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. 12వ వార్డు బీజేపీ అభ్యర్థి తులసి కృష్ణను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను





విజ్ఞప్తి చేశారు. "కృష్ణ వెనుక నేనున్నాను... నా వెనుక మోదీ ఉన్నారు. ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాం" అన్నారు. ఈటెల రాజేందర్ ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను అవమానపరిస్తున్నారని, కొత్త పెన్షన్ల కోసం ఉన్న సమస్యలపై చర్యలు లేకపోవడం వల్ల ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. అంతేకాక, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యం, అంగన్‌వాడీ నిధులపై ప్రజలకు గుర్తు చేయిస్తూ, "మనం తినే బియ్యం మోదీ ఇస్తున్నారు. అంగన్‌వాడీలు కేంద్ర నిధులతోనే నడుస్తున్నాయి. వాళ్ల దగ్గర ఇవ్వడానికి ఏమీ లేదు" అని చెప్పారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# నగర పాలక సంస్థ విధులను పకడ్బందీగా నిర్వహించాలి..

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి- 06(తెలంగాణ ముచ్చట్లు)





నగరపాలక సంస్థ సిబ్బంది తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశం మందిరంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పని తీరుపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కారణంగా కొంత మేర మంచి ఫలితాలు వచ్చాయని, మరొకసారి ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. చెత్త రవాణా వాహనాలకు జిపిఎస్, ఫ్యూయల్ సెన్సార్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. చెత్త వాహనాల మూవ్ మెంట్ రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. వాహనాలకు అవసరమైన మరమ్మత్తులు ఉంటే వెంటనే చేయించాలని, పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదులో ఎఫ్.ఆర్.ఎస్. విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో భాగంగా నగరంలో కనీసం 1000 ఓపెన్ ప్లాట్ లను గుర్తించి అక్కడ పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో మీడియన్ లను రెగ్యులర్ గా క్లీన్ చేయాలని, డస్ట్ ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

నగరంలో బ్రిడ్జి మీద ప్రచార హోర్డింగులు, పోస్టర్ లు అనుమతి లేకుండా పెట్టడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా ఉన్న హోర్డింగులు, పోస్టర్లను తొలగించాలని, మరొకసారి అనుమతి లేకుండా పబ్లిక్ ప్రదేశాలలో పోస్టర్లు అతికిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థలో నూతనంగా కొనుగోలు చేస్తున్న 4 వాహనాలు త్వరగా డెలీవరి వచ్చేలా చూడాలని అన్నారు. నగరంలో ప్రధాన రోడ్లలో డస్ట్ ఇబ్బంది లేకుండా, పేవ్ మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో మంజూరైన సిసి రోడ్ల, డ్రైయిన్ లను పూర్తి స్థాయిలో గ్రౌండ్ అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సిసి రోడ్ల నిర్మాణం త్వరగా నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పనుల పర్యవేక్షణకు డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎఫ్.ఎస్.టీ.పి. మరమ్మత్తు పనులు చేపట్టాలని అన్నారు.

అభివృద్ధి పనులలో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని, పనుల పురోగతిపై ప్రతివారం నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మార్చి మొదటి వారం నాటికి ఫుట్ పాత్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నగరంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను వసూలు కేవలం 32 శాతం మాత్రమే ఉందని, నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఆస్తి పన్ను చెల్లించకపోతే వెంటనే సంబంధిత భవనాలపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకొని సీజ్ చేయాలన్నారు. నగరంలో డిఫాల్టర్ లను గుర్తించి వారికి వాటర్ సప్లై కట్ చేయాలని, ఇండ్లను, భవనాలను సీజ్ చేయాలని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఈ కార్యక్రమం అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాణిజ్య సముదాయాల ఆస్తిపన్ను వసూలు కూడా 33 శాతం మాత్రమే ఉందని, పన్ను కట్టని వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్సులు వెంటనే రద్దుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీకి పన్ను కట్టడం ప్రతి పౌరుడి బాధ్యత అని, పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. మీడియన్ మీద మొక్కలకు డ్రిప్ పైప్ లైన్ ద్వారా వాటర్ అందించాలని, పార్కులలో పచ్చదనం మెయింటైన్ చేసేందుకు వాటరింగ్ షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. నగరంలో నూతనంగా వేస్తున్న ఫుట్ పాత్ ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, ఫుట్ పాత్ లపై ఎటువంటి ర్యాంప్ నిర్మాణాలకు కూడా అనుమతించవద్దన్నారు. రోడ్డు విస్తరణ జరిగే చోట తప్పనిసరిగా పేవ్ మెంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. వాయు కాలుష్యానికి ముఖ్య కారణం రోడ్డు మీద ఉండే డస్ట్ కారణంగా ఉంటుందని, దీని నివారణకు మనవంతు చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అన్నారు. నగరానికి త్రాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన త్రాగునీటి సరఫరా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న మోటార్ లలో అవసరమైన మరమ్మత్తులు చేస్తే విద్యుత్ బిల్లులు తగ్గుతాయని, ఈ పనులను 3 వారాల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నగరంలో ఎస్.టి.పి. ల నిర్మాణానికి అవసరమైన భూములు ఫిబ్రవరి 15 నాటికి అప్పగిస్తామన్నారు. నగరంలో పెండింగ్ ఉన్న 1.6 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను అదనపు లేబర్ పెట్టి 4 వారాల్లో పూర్తి చేయాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ క్రింద నగరంలో ఉన్న కుక్కలను నగరానికి దూరంగా షెల్టర్ ఏర్పాటు చేసి తరలించాలని అన్నారు. నగరంలో వీధి కుక్కలకు ఎవరు ఫీడ్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కుక్కలకు అన్నం పెట్టడం వలన అలవాటుగా మారి, అన్నం దొరకని రోజు అవి దాడులకు పాల్పడుతున్నాయని, ఈ అంశం ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. నగరంలో ఎక్కడా డార్క్ ఏరియా ఉండకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, సహాయ మునిసిపల్ కమీషనర్ అనిల్ కుమార్, మునిసిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆమోదం లేని గొల్లపల్లి–చీర్కపల్లి రిజర్వాయర్‌ను వెంటనే నిలిపివేయాలి



◆ సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్

వనపర్తి,ఫిబ్రవరి6(తెలంగాణ ముచ్చట్లు):

ప్రజల ఆమోదం లేకుండా నిర్మిస్తున్న గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే నిలిపివేయాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక అఖిల పక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులు నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. 39 రోజులుగా కొనసాగుతున్న ఈ ధర్నా సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ..ఏ ప్రాజెక్ట్ అయినా నిర్మించాలంటే ముందుగా అక్కడి రైతుల అభిప్రాయాలు తీసుకొని, అందరి ఆమోదంతోనే చేపట్టాలని అన్నారు. రైతుల కోసమేనని చెప్పే ప్రాజెక్టును రైతులే వద్దంటూ ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు.రాజ్యాంగం ప్రకారం రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా ప్రాజెక్టును నిర్మించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సమీపంలో యెదుల రిజర్వాయర్ ఉండగా గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం లేదన్నారు. ఈ ప్రాంత రైతులు సన్నకారు రైతులని, వారిలో చాలామందికి రెండు లేదా మూడు ఎకరాలకంటే ఎక్కువ భూమి లేదని తెలిపారు. ఉన్న కొద్ది భూములు ప్రాజెక్టులో పోతే వారు ఎలా జీవించగలరని ప్రశ్నించారు. ఒకప్పుడు భూములు లేక వారి పూర్వీకులు బొంబాయిలో, భూస్వాముల వద్ద వెట్టి చాకిరి చేసి రక్తం దారపోసి తమ వారసుల కోసం రెండు మూడు ఎకరాల భూములు కొనుగోలు చేశారని గుర్తు చేశారు.ఇప్పుడు అదే భూములు ప్రాజెక్టులో మునిగితే వారి వారసులు జీవనోపాధి కోసం మళ్లీ వలస వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ఆమోదం లేని గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను నిలిపివేసి, రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో కవి జనజ్వాల, రాంరెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి, రాములు, మహమూద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెబ్బేరు,ఫిబ్రవరి6(తెలంగాణ ముచ్చట్లు):



జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులకు సంబంధించి 12 మంది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులే గెలుస్తారని, తద్వారా పెబ్బేరు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అహంకారుల మాటలు ప్రజలు నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని ఒకటవ, రెండో, మూడో, నాలుగో, ఐదో, ఆరవ వార్డులలో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ వార్డు అభ్యర్థి కుసుమ, రెండో వార్డు అభ్యర్థి సుమిత్ర, మూడో వార్డు అభ్యర్థి వెంకటరమణ, నాలుగో వార్డు అభ్యర్థి జములమ్మ, ఐదో వార్డు అభ్యర్థి భాగ్యలక్ష్మి శివ, ఆరవ వార్డు అభ్యర్థి తాటికొండ కృష్ణలను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి తో కలిసి అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పెబ్బేరు పట్టణంలోని ముప్పై ఎకరాల సంత స్థలాన్ని కబ్జా చేసి విలువైన భూమిని సొంతం చేసుకోవాలని ప్రయత్నించిన ఓ మాజీ మంత్రి నేడు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు.పెబ్బేరు పట్టణంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు అభివృద్ధి చేయలేదని, ఇందిరమ్మ రాజ్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలోకి వచ్చిన తరువాత కేవలం రెండేళ్లలోనే పెబ్బేరు మున్సిపాలిటీలో 54 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలు ఇంటింటికి అందుతున్నాయని పేర్కొన్నారు.అవినీతిపరుల మోసపూరిత మాటలను నమ్మకుండా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తేనే పెబ్బేరు మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలత, రంజిత్ కుమార్, దయాకర్ రెడ్డి, గంధం రాజశేఖర్, సురేందర్ గౌడ్, రామచంద్ర రెడ్డి, సాయిచరణ్ రెడ్డి, మణిగిల్ల తిరుపతిరెడ్డి, యుగేందర్ రెడ్డి, యాపర్ల రాంరెడ్డి, గుమ్మడం వెంకటరామిరెడ్డి, శ్రీహరి రాజు, రాజశేఖర్ రెడ్డి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న రజిత పరమేశ్వర్ రెడ్డి



◆ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందిన ఉప్పల్ కార్పొరేటర్

ఉప్పల్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని సత్యానగర్ కాలనీలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం, ఉప్పల్ ప్రజలపై స్వామివారి కృప, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశోక్ గుప్తా, సుజాత, సల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, లక్ష్మి, ధనలక్ష్మి, శ్వేత, సరవాణి పాల్గొన్నారు. అలాగే విజయ్‌కుమార్ కాలనీ అధ్యక్షుడు సతీష్ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ రాజు, సతీ, నరేష్, రాజీకాంత్, వెంకటేష్ ముదిరాజు, నరేష్ చారి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వికలాంగుల సంఘాల మద్దతు

◆ వికలాంగుల సంఘం వనపర్తి పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం

వనపర్తి,ఫిబ్రవరి6(తెలంగాణ ముచ్చట్లు):



వనపర్తి జిల్లా పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు జిల్లాలోని వికలాంగుల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. జిల్లాలోని వికలాంగుల విజ్ఞప్తి మేరకు వనపర్తి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని 1000 గజాల విస్తీర్ణంలో జిల్లా వికలాంగుల పునరావాస శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న సందర్భంగా వికలాంగుల సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా జిల్లాలోని వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక శిబిరం నిర్వహించి 716 మందికి ఉపకరణాలు అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.జిల్లాలో వికలాంగుల సమస్యలను గుర్తించి, వారిని అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు తీసుకుంటున్న చర్యలకు సంఘాల ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పామిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, వనపర్తి పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షుడు భాను కుమార్, ఉపాధ్యక్షుడు రమేష్, మధు, వివిధ వికలాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# రాజకీయాలు కాదు, ప్రజా శ్రేయస్సే నా లక్ష్యం కార్పొరేటర్ శాంతి సాయిజెన్

నాచారం, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ నాచారం రైతు బజార్‌లోని బోర్‌వెల్ కొద్దీ రోజుల క్రితం పాడిపోయింది. దీని కారణంగా మార్కెట్ వాసులు, కూరగాయల వ్యాపారస్తులు, బస్తీ దవాఖానకు వచ్చే వారు మరియు డాక్టర్లు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ దృష్టికి తీసుకురావడం జరిగింది. హైదరాబాద్‌లో బోర్‌వెల్‌ల రిపేర్ లేదా మెయింటెనెన్స్ జిహెచ్ఎంసి ద్వారా చేయడంలేదని కార్పొరేటర్ తెలిపారు. దీంతో, ఆయన స్వయంగా తన ఖర్చుతో బోర్‌వెల్ రిపేర్ చేయిస్తానని హామీ ఇచ్చి, ఆ పని చేపట్టారు.ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారస్తులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్ కిట్టు, మూర్తి దయానంద్, కిషోర్, రమేష్, వేణు, తరుణ్, నిర్మల, రాము, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.కార్పొరేటర్ శాంతి సాయిజెన్ మాట్లాడుతూ, “రాజకీయాలు కాదు, ప్రజల శ్రేయస్సే నా ప్రధాన లక్ష్యం” అని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## చేవెళ్ల మహిళా న్యాయవాది హత్య కేసులో సిట్‌తో విచారణ చేపట్టాలి

- తెలంగాణ డీజీపీని కలిసి వినతిపత్రం అందజేసిన బార్ అసోసియేషన్ల ప్రతినిధులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

చేవెళ్లలో ఇటీవల జరిగిన దారుణ ఘటనలో మహిళా న్యాయవాది కుమారి స్వప్న హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల్లో తీవ్ర ఆవేదనను కలిగించిందని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. అమరేందర్ రెడ్డి అన్నారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా సమగ్ర విచారణ జరిపి, నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ మేరకు ఆయన ఇతర బార్ అసోసియేషన్ అధ్యక్షులతో కలిసి తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీస్ శాఖలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డీజీపీని కోరారు. మహిళా న్యాయవాదుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న భద్రత, వృత్తిపరమైన సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి ఆకర్షించేందుకు ఫెడరేషన్ తరపున పాదయాత్ర నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఈ పాదయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కూడా డీజీపీని కోరినట్లు వెల్లడించారు.న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టపరమైన రక్షణ చర్యలు అవసరమని, న్యాయవాదుల భద్రతకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

## జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి అదృశ్యం

- చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు

**చర్లపల్లి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**



జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న యువకుడు అదృశ్యమైన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అలకుంట్ల చారి తెలిపిన వివరాల ప్రకారం, అతని సోదరుడు అలకుంట్ల విజయ్ (30) జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల భార్యతో జరిగిన కుటుంబ కలహం అనంతరం విజయ్ చర్లపల్లిలోని పూకట్‌నగర్‌లో తన సోదరుడి ఇంటికి వచ్చి రెండు రోజులపాటు అక్కడే ఉండి వెళ్లాడు. అనంతరం కొద్ది రోజులుగా విజయ్ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఈ విషయమై అలకుంట్ల చారి చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విజయ్ ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



## కాప్రాలో గంజాయి అక్రమ విక్రయాలపై ఎస్టీఎఫ్ దాడులు

- మొత్తం 365 గ్రాముల గంజాయి స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు

**కుషాయిగూడ , ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కాప్రా ప్రాంతంలో గంజాయి అక్రమ విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎస్టీఎఫ్ బీ టీమ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి గంజాయితో పాటు వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ బీ టీమ్ ఎస్సైలు నాగరాజు, జ్యోతి తమ సిబ్బందితో కలిసి కాప్రాలోని నేతాజీనగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. అక్కడ గంజాయి అమ్మకాలు జరుపుతున్న మంద రాహుల్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి 131 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అలాగే అదే కాప్రా పరిధిలోని వంపుగూడ ప్రాంతంలో మరో దాడి నిర్వహించి అక్కడ అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి 234 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఈ రెండు కేసుల్లో భాగంగా విశ్వనాథ్, మనోజ్, తనీష్, మంద రాహుల్‌లను పోలీసులు అరెస్టు చేశారు.ప్రాథమిక విచారణలో నిందితులు గంజాయిని మహారాష్ట్ర నుంచి ఒకరు, హైదరాబాద్‌లోని ధూళిపేట ప్రాంతం నుంచి మరొకరు తెచ్చి కాప్రా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చిల్లరగా విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి గంజాయి తరలింపుకు ఉపయోగించిన మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయిని కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్టీఎఫ్ అధికారులు తెలిపారు.గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం స్వాధీనం

- అలియాబాద్‌లో ఫ్లైయింగ్ స్క్వాడ్ కట్టుదిట్టమైన చర్యలు

**మేడ్చల్–మల్కాజ్గిరి, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**



మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు-2026ను పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు పంపిణీ జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి.ఈ తనిఖీలలో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్ గాడి మలక్ పేటలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. తనిఖీల సందర్భంగా ఏ. అరవింద్ రెడ్డి (తండ్రి: దామోదర్ రెడ్డి) నివాసంలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 6.75 లీటర్ల మద్యంను గుర్తించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పోలీసు అధికారుల సహకారంతో అక్రమ మద్యం నిల్వలను వెంటనే సీజ్ చేసి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం జీనో వ్యాలీ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలను ప్రలోభపెట్టే చర్యలను సహించబోమని, అక్రమ మద్యం, నగదు, బహుమతుల పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అలాగే ప్రజలు ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## తాలుక స్థాయి సీఎం కప్‌లో వెల్టూర్ బాలికల వాలీబాల్ జట్టు అగ్రస్థానం

**పెద్దమందడి,ఫిబ్రవరి6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో నిర్వహించిన తాలూకా స్థాయి సీఎం కప్ క్రీడల్లో జడ్పీహెచ్ఎస్ వెల్టూర్ పాఠశాలకు చెందిన బాలికల వాలీబాల్ జట్టు పెద్దమందడి మండలం తరపున పాల్గొని అగ్రస్థానంలో నిలిచింది. వివిధ పాఠశాలల జట్లతో పోటీపడి అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు విద్యార్థినీలను అభినందించారు. అనంతరం జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా విద్యార్థినీల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఆయన తెలిపారు.ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.



## ఉప్పల్ హిల్స్‌లో రూ.50 లక్షల కమ్యూనిటీ హాల్ నిర్మాణం

- పనులు పరిశీలించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**





ఉప్పల్ హిల్స్ ప్రాంతంలో రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.శుక్రవారం ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాల్ పూర్తయితే స్థానికులకు వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్, దుర్గం నవీన్ యాదవ్, గోవింద్ కుమార్ స్వామి, సల్ల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, పి. రామచందర్, టి. శ్రీనివాస్ రెడ్డి, జి. రమేష్, టి.విజయ్ సింగ్, గోవిందు, సుధాకర్ రెడ్డి, కె. రాములు, అక్కు రవి, మధు, అమృత్ రాజు, మహేష్ గౌడ్, శేఖర్ గౌడ్, పి. మహేందర్, సంజయ్, బి. అనిత, సత్యనారాయణ చారి, గౌరిగే సత్తయ్య, మేడిశెట్టి క్లైమెట్, ఎస్. రామస్వామి, గోవింద్ కొమరయ్య, గోవింద్ నరసయ్య, పర్వతాలు యాదవ్, ఎన్. గిరి, గొర్రె సత్తయ్య, కె. బీరయ్య, జి. బీరయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం – అధికారులు హెచ్చరిక

**కీసర, ఫిబ్రవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

కీసర సబ్‌స్టేషన్లలో నిర్వహణ, కొత్త సర్వీస్ విడుదల, డిసి పనులు మరియు పిఎంఐ కారణంగా కింది ఫీడర్ల పరిధిలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.అంకిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ నుండి:సాల్వో ఎక్స్‌ప్లోజివ్ ఫీడర్ (11 కేవీ)సమయం: ఉదయం 10:00 - మధ్యాహ్నం 01:00 విద్యుత్ ఉండని ప్రాంతాలు: సాల్వో ఎక్స్‌ప్లోజివ్, బాలాజీ మెటల్, జైరామ్ రెడ్డి మెటల్, జైదేవ్ కాంక్రీట్, క్రషర్స్ కంపెనీ.తాతా హాస్పిటల్ ఫీడర్ (11 కేవీ)సమయం: ఉదయం 10:00 - మధ్యాహ్నం 01:00విద్యుత్ ఉండని ప్రాంతాలు:అంకిరెడ్డిపల్లి గ్రామం, అంకిరెడ్డిపల్లి చౌరస్తా, తాతా హాస్పిటల్, వాయుపురి వెంచర్ పెద్దమ్మ చెరువు ఫీడర్ (11 కేవీ) సమయం: ఉదయం 10:00 - మధ్యాహ్నం 01:00 విద్యుత్ ఉండని ప్రాంతాలు:అంకిరెడ్డిపల్లి గ్రామం, అంకిరెడ్డిపల్లి చౌరస్తా, తాతా హాస్పిటల్, వాయుపురి వెంచర్ యాద్గర్‌పల్లి సబ్‌స్టేషన్ నుండి:తిమ్మాయిపల్లి ఫీడర్ (11 కేవీ) సమయం: మధ్యాహ్నం 02:00 - సాయంత్రం 05:00 విద్యుత్ ఉండని ప్రాంతాలు: తిమ్మాయిపల్లి గ్రామం, ఏజీఎల్, నర్సంపల్లి, ధర్మారం గ్రామం రాంపల్లి సబ్‌స్టేషన్ నుండి:కరీంగుడ్ ఫీడర్ (11 కేవీ)సమయం: ఉదయం 10:30 - 11:00 విద్యుత్ ఉండని ప్రాంతాలు: కరీంగుడ్ గ్రామం, శిల్పా వెంచర్, తారక ఎన్‌క్లేవ్, కాకతీయ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, సాహితి హరహర, లోటస్ కౌంటీ, సాయి కాలనీ, చంద్ర ఎన్‌క్లేవ్, రాజి రెడ్డి ఎన్‌క్లేవ్, మైత్రి నగర్, భగవాన్ కాలనీ, గ్రీన్ సిటీ, నక్షత్ర ఎన్‌క్లేవ్, లెజెండ్ కాలనీ, నీలగిరి ఎస్టేట్ హెచ్చరిక:విద్యుత్ నిలిపివేత సమయంలో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



## 108–102 వాహనాల ఆకస్మిక తనిఖీ

- సేవల్లో వేగం, నాణ్యత పెంచాలి: కిరణ్ కిషోర్

**సత్తుపల్లి, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**





తెలంగాణ గ్రీన్ హెల్త్ సర్వీస్ మానవ వనరుల ముఖ్య అధికారి కిరణ్ కిషోర్ ఖమ్మం జిల్లాలోని 108, 102 (అమ్మ ఒడి), 1962 (పశు సంచార వాహనం) మరియు పార్థివ వాహన సేవలకు సంబంధించిన వాహనాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల పనితీరు, ఉద్యోగుల హాజరు, సేవల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. నెలవారీగా నమోదవుతున్న కేసుల వివరాలతో పాటు జిల్లాలో స్థానికంగా నివసిస్తూ విధులు నిర్వహిస్తున్న అధికారుల పనితీరును సమీక్షించారు. వాహనాల్లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందులు, వాటి గడువు తేదీలను పరిశీలించి, ఎప్పటికప్పుడు సక్రమంగా ఉంచాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి చేర్చాలని ఆదేశించారు. బంగారు గంట ప్రాముఖ్యతను వివరించిన కిరణ్ కిషోర్, వేగంగా స్పందిస్తూ మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. సేవల నిర్వహణలో చురుకుదనం చూపుతున్న జిల్లా మేనేజర్, కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ తనిఖీలో ఖమ్మం జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను ఇరవై నాలుగు గంటలు నిరంతరం పర్యవేక్షిస్తున్న కార్యక్రమ నిర్వాహకుడు షేక్ నజీరుద్దీన్ పాల్గొన్నారు.

## ప్రజల స్వరం నిశ్శబ్దమైతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది

- దయానంద్ ముదిరాజ్

**వనపర్తి,ఫిబ్రవరి6(తెలంగాణ ముచ్చట్లు):**



ప్రజల స్వరం నిశ్శబ్దమైతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుందని స్వతంత్ర శాసనసభ్య అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వనపర్తి పట్టణంలోని ఐదవ వార్డులో స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.టి. శ్యామ్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా దయానంద్ ముదిరాజ్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ సమస్యలు, అన్యాయంగా ఆక్రమణకు గురవుతున్న భూములపై అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజల హక్కుల కోసం నిలబడుతున్న వ్యక్తిగా జి.టి. శ్యామ్ నేడు ఐదవ వార్డు నుంచి స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నారని పేర్కొన్నారు.మున్సిపాలిటీలో ప్రజల సమస్యలపై ప్రజల గొంతుగా నిలబడేందుకు ముందుకు వస్తున్న ఇలాంటి నాయకులకు సామాజికవాదులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ సహకరించాలని కోరారు. వార్డు సమస్యల నివారణ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసే అభ్యర్థిని గెలిపించాలంటే గాలిచల్లని యంత్రం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు, పార్టీలు ఏవైనా సరే ప్రజలు ఆత్మాభిమానంతో, చైతన్యంతో నిర్ణయం తీసుకొని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని దయానంద్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

# నేడు..కొత్తగూడెంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి విస్తృత ప్రచారం



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**

పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శనివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటన రాత్రి 8 గంటల వరకు కొనసాగనుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు 52వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది. అనంతరం 60వ, 54వ, 53వ, 29వ, 30వ డివిజన్లలో మధ్యాహ్నం వరకు పర్యటన కొనసాగనుంది. తదుపరి 55వ, 59వ, 56వ డివిజన్లలో ప్రచారం చేపట్టనున్నారు. సాయంత్రం 57వ, 58వ, 49వ, 10వ, 11వ, 12వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం రాత్రి 7 గంటలకు 13వ డివిజన్‌లో, రాత్రి 8 గంటలకు 51వ డివిజన్‌లో కార్యక్రమాలు పూర్తిచేయనున్నారు. ఆయా వార్డుల ప్రధాన కూడళ్లలో నిర్వహించే రోడ్‌షోల ద్వారా అభ్యర్థుల విజయానికి మద్దతుగా ఎంపీ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుంటూ అభివృద్ధి అంశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థులతో పాటు వార్డు ఇన్ చార్జ్ లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ బాధ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది.

# ముున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**

ఫిబ్రవరి11 తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మున్సిపాలిటీ ప్రాంతాలలో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికలకు ఫిబ్రవరి 9 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి ఫిబ్రవరి 11 న ఎన్నికలు ముగిసే వరకు మద్యం విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఫిబ్రవరి 13 న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖమ్మం జిల్లా పరిధిలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మునిసిపాలిటీ కౌంటింగ్ సెంటర్ పరిధిలో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు.




# బ్యాలెట్ పేపర్స్ స్ట్రాంగ్ రూమ్ అర్మడ్ గార్డు తనిఖీ చేసిన అడిషనల్ డిసిపి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాలోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని ఏర్పాటు చేసిన ఏదులాపురం మునిసిపాలిటీ ఎన్నికల బ్యాలెట్ పేపర్స్ స్ట్రాంగ్ రూమ్ అర్మడ్ గార్డును అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్ రావు సందర్శించి తనిఖీ చేశారు. నిరంతర అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

# సాఫ్ట్‌వేర్ సిటీలో హార్డ్ లైఫ్..!

హైదరాబాద్ ఆకాశాన్ని తాకుతున్న
టవర్స్ కింద,
డిగ్రీ సర్టిఫికెట్లు తలదాచుకున్నాయి
అద్దె గదుల్లో.
కంపెనీ గేట్ల ముందు నిలబడి
యువత కాలాన్ని క్యూ లో పెట్టి
భవిష్యత్తు కోసం టోకెన్
తీసుకుంటున్నారు.

కాఫీ కప్పుల్లో కరిగిపోతున్న కలలు,
పీడీఎఫ్ ఫైళ్లలో బంధించబడిన ప్రతిభ,
ఇంటర్వ్యూ రిజెక్ట్ మెసేజ్
రోజూ ఒక కొత్త రాజకీయ హత్య.

ఈ నగరం ఉద్యోగాలు ఇవ్వదు,
ఆశను అమ్ముతుంది ఈఎంఐల్లో.
నిరుద్యోగం ఇక్కడ శాపం కాదు,
సిస్టమ్ నేర్పిన శిక్ష.

మా తల్లుల ప్రార్థనలు సిగ్నల్ లైట్ దగ్గర
ఆగిపోతే,
మా జీవితాలు మెట్రో టైమ్‌టేబుల్ లో
ఇరుక్కుంటాయి.
హైదరాబాద్ లో నిరుద్యోగి అంటే
ఒక మనిషి కాదు... ఒక నడిచే
రిజ్యూమే.



-బసడ సంపత్ యాదవ్

# సత్తుపల్లి 14వ వార్డులో ప్రజల మనిషిగా కూసంపూడి మహేష్

**సత్తుపల్లి, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**






సత్తుపల్లి మున్సిపల్ రాజకీయాల్లో ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను నేరుగా వింటూ పరిష్కారానికి కృషి చేసే నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అలాంటి గుర్తింపును సంపాదించుకున్న నాయకుల్లో 14వ వార్డు నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో ఉన్న కూసంపూడి మహేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో మున్సిపాలిటీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం మహేష్‌కు పరిపాలనపై స్పష్టమైన అవగాహనను అందించిందని స్థానికులు చెబుతున్నారు. వార్డులోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో ఆయనకు మంచి పట్టుందని పేర్కొంటున్నారు. వయస్సు, సామాజిక వర్గాల తేడా లేకుండా అందరితో స్నేహపూర్వకంగా మెలగడం మహేష్ ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు. డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీరు, రహదారి సమస్యలపై పలుమార్లు అధికారులను అప్రమత్తం చేసి పరిష్కారానికి కృషి చేసిన సందర్భాలు ఉన్నాయని వార్డు వాసులు గుర్తు చేస్తున్నారు. అందుకే ఆయనను “మనవాడు”గా భావిస్తున్నామని చెబుతున్నారు. హడావిడి ప్రచారానికి దూరంగా ఇంటింటికీ వెళ్లి పలకరించడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, యువతతో అభివృద్ధి అంశాలపై చర్చించడం మహేష్ ప్రచార శైలిగా కనిపిస్తోంది. రాజకీయ నాయకుడిలా కాకుండా కుటుంబ సభ్యుడిలా మెలగడం వల్ల ప్రజల్లో ఆయనకు ఆదరణ పెరుగుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 14వ వార్డులోని ప్రతి కాలనీ సమస్యలపై పూర్తి అవగాహనతో హామీలకే పరిమితం కాకుండా కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్న దృక్పథం తనలో ఉందని మహేష్ చెబుతున్నారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేస్తున్నారు. స్థానిక విశ్లేషణల ప్రకారం పరిపాలనా అనుభవం, అన్ని వర్గాలతో సన్నిహిత అనుబంధం, ఎప్పుడూ అందుబాటులో ఉండే స్వభావం, అభివృద్ధిపై స్పష్టమైన దృష్టి వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారుతున్నాయని తెలుస్తోంది. “మన ఓటు - మన భవిష్యత్తు” అనే భావనతో 14వ వార్డు ప్రజలు అభివృద్ధి వైపు ఆలోచన పెంచుకుంటున్నారని స్థానికులు అంటున్నారు.

# బీఆర్ఎస్‌నే తెలంగాణకు భరోసా.!

- ఆలోచించి ఓటు వేయాలి.
- సోయం వీరభద్రం.

**అశ్వరావుపేట, ఫిబ్రవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**





అశ్వరావుపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు జోరు చూపాయి. 14వ వార్డు చైర్‌పర్సన్ అభ్యర్థి భుక్య ఉదయ జ్యోతి గెలుపును లక్ష్యంగా చేసుకొని జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సోయం వీరభద్రం ఆధ్వర్యంలో వార్డు పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గులాబీ జెండాలతో వీధివీధిన పార్టీ కార్యకర్తలు కదం తొక్కారు. ఈ సందర్భంగా సోయం వీరభద్రం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీనే భరోసాగా నిలిచిందన్నారు. అధికార ఆశతో కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్‌కు రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటుతో గట్టి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార నిమిత్తం అశ్వరావుపేటకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ మెచ్చాతో పాటు కొమ్ముగూడెం సర్పంచ్ సోయం సత్యవతి, పార్కెలగండి సర్పంచ్ కొమరం సుశీల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పలపాటి వెంకటరమణ, రావు జోగేశ్వరరావు, కోర్సా వెంకటేష్, బాషా తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

# రైతులకు ఎరువుల సరఫరాపై లోక్‌సభలో స్పష్టత కోరిన ఎంపీ డా. కడియం కావ్య

**వరంగల్,ఫిబ్రవరి07 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లా రైతులకు ఎరువుల సరఫరా అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రశ్నించారు. సాగు సీజన్‌లో ఎరువులు సమయానికి అందుతున్నాయా, సబ్సిడీ సరైన విధంగా అమలవుతోందా అనే అంశాలపై కేంద్రం వివరణ ఇవ్వాలని ఆమె కోరారు.

దీనికి కేంద్ర రసాయనాలు–ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తూ, రాష్ట్ర స్థాయిలో ఎరువుల లభ్యతను కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, జిల్లా స్థాయిలో పంపిణీ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన లెక్కల ప్రకారం గత మూడు సంవత్సరాలుగా వరంగల్ జిల్లాలో యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే ఎరువుల లభ్యత సంతృప్తికరంగా ఉందని కేంద్రం తెలిపింది. అయితే, భూమి స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ఎంపీ పేర్కొన్నారు. ఎరువుల విక్రయాల్లో ఆధార్ ఆధారిత ప్రత్యక్ష నగదు బదిలీ విధానం అమలు చేస్తున్నామని, రైతులకు ఎస్ఎంఎస్ ద్వారా ధరలు, సబ్సిడీ వివరాలు పంపుతున్నామని కేంద్రం వివరించింది. ఈ సందర్భంగా డా. కడియం కావ్య స్పందిస్తూ, కాగితాల మీద లెక్కలు కాకుండా రైతులకు పొలాల్లో అవసరమైన సమయంలో ఎరువులు అందడమే అసలు ప్రమాణమని స్పష్టం చేశారు. వరంగల్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో నిరంతరం లేవనెత్తుతానని తెలిపారు.



# సంపాదన పెరిగినా సంతోషం ఎందుకు తగ్గుతోంది?

- ఆర్థిక అభివృద్ధి మధ్య మానసిక ఖాళీకి కారణాలు ఏమిటి?



ఒకప్పుడు నెల జీతం పెరిగితే ఆనందం పెరిగేది. నేడు ఆదాయం పెరుగుతున్నా, మనసులో సంతృప్తి తగ్గుతున్నట్లు అనిపిస్తోంది. పెద్ద ఇళ్లు, ఖరీదైన వాహనాలు, చేతిలో ఆధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ, మనసు మాత్రం ప్రశాంతంగా ఉండటం లేదు. సంపాదన పెరుగుదలతో పాటు సంతోషం కూడా పెరగాలి అన్న సహజ భావన ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విరుద్ధ పరిస్థితి వెనుక ఉన్న కారణాలను సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు మన జీవితాలు మరింత వేగంగా మారాయి. ఉద్యోగ ఒత్తిళ్లు పెరిగాయి. పోటీ తీవ్రమైంది. ఎక్కువ సంపాదించాలనే తాపత్రయం మనిషిని నిరంతర పరుగులోకి నెట్టేస్తోంది. ఈ పరుగులో కుటుంబానికి సమయం లేదు, స్నేహానికి చోటు లేదు, తనకు తాను ప్రశ్నించుకునే క్షణాలు లేవు. ఫలితంగా సంపాదన ఉన్నా, మనసు ఖాళీగా మారుతోంది.

సంతోషాన్ని మనం క్రమంగా వస్తువులతో కొలవడం మొదలుపెట్టాం. ఎంత సంపాదిస్తే అంత సంతోషం అన్న భావన మన ఆలోచనల్లో బలంగా నాటుకుపోయింది. కానీ ఈ ఆలోచనే మన అసంతృప్తికి మూలం అవుతోంది. ఎందుకంటే మనకంటే ఎక్కువ ఉన్నవారితో పోల్చుకోవడం, ఎప్పుడూ ఇంకేదో కావాలన్న భావనను పెంచుతోంది. ఈ తులనాత్మక జీవితం మనకు ఉన్నదాన్ని ఆస్వాదించనివ్వకుండా చేస్తోంది. సంపాదన పెరిగేకొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతున్నాయి. అప్పులు, ఖర్చులు, భవిష్యత్తుపై భయాలు మనసును వెంటాడుతున్నాయి. ఒక స్థాయికి చేరుకున్నాక విశ్రాంతి దొరుకుతుందన్న ఆశ, ఆ స్థాయి చేరిన తర్వాత కూడా నెరవేరడం లేదు. ఎందుకంటే ఆశలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ అంతులేని ఆశలే సంతోషానికి అడ్డుగోడగా మారుతున్నాయి.

కుటుంబ బంధాల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సంపాదన కోసం ఎక్కువ సమయం పనికి కేటాయించడంతో, కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఒకే ఇంట్లో ఉన్నా, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రపంచాల్లో మునిగిపోతున్నారు. మాటలు తగ్గుతున్నాయి, అనుబంధాలు పల్చబడుతున్నాయి. సంపాదన పెరిగినా, ఆ సంపాదనతో పంచుకునే ఆనందం మాత్రం తగ్గిపోతోంది.

సామాజిక జీవితం కూడా మారిపోయింది. ఒకప్పుడు స్నేహితులతో కలిసి గడిపే సమయం మనసుకు ఉత్సాహాన్ని ఇచ్చేది. ఇప్పుడు ఆ స్థానాన్ని ఒంటరితనం తీసుకుంటోంది. సంపాదన పెరిగినా, మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. భావాలను పంచుకునే వేదికలు తగ్గిపోవడంతో, మనసులోని భారాన్ని మోసుకుంటూనే జీవించాల్సి వస్తోంది. సంతోషం అనేది కేవలం సంపాదనతో వచ్చే విషయం కాదన్న సత్యాన్ని సమాజం మరిచిపోతోంది. ఆరోగ్యం, ప్రశాంతత, బలమైన సంబంధాలు, ఆత్మ సంతృప్తి - ఇవన్నీ కలిసినప్పుడే నిజమైన సంతోషం లభిస్తుంది. కానీ మనం ఈ అంశాలను పక్కనపెట్టి, కేవలం ఆదాయం పైనే దృష్టి పెట్టడం వల్ల జీవితం అసమతుల్యంగా మారుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే మన ఆలోచనల్లో మార్పు రావాలి. ఎంత సంపాదిస్తున్నామన్నదికంటే, ఎలా జీవిస్తున్నామన్నదే ముఖ్యమని గుర్తించాలి. మనకు ఉన్నదానిపై కృతజ్ఞత భావం పెంచుకోవాలి. కుటుంబానికి, స్నేహాలకు, మనసుకు సమయం కేటాయించాలి. అప్పుడే సంపాదనతో పాటు సంతోషం కూడా మన జీవితంలో స్థిరపడుతుంది.

మొత్తంగా సంపాదన పెరుగుతుండటం అభివృద్ధికి సంకేతమే. కానీ అదే అభివృద్ధి మనసుకు ఆనందం ఇవ్వకపోతే, ఆ అభివృద్ధి అసంపూర్ణమే. నిజమైన సంపద డబ్బులో కాదు, మనసు ప్రశాంతతలో ఉందన్న సత్యాన్ని సమాజం అర్థం చేసుకున్న రోజే, సంపాదనతో పాటు సంతోషం కూడా పెరుగుతుంది.

## కారు కొనుగోలుదారులకు షాక్.. టయోటా కార్ల ధరలు పెంపు..!

దేశీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో మరోసారి ధరల పెంపు వార్త వినియోగదారులను నిరాశకు గురిచేసింది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తమ వాహనాల ధరలను గరిష్టంగా 1.98 శాతం వరకు పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ముడి సరుకుల ధరలు పెరగడం, ఉత్పత్తి ఖర్చులు అధికమవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

టయోటా పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్లాంజా, రూమియన్, అర్బన్ క్రూయిజర్ టైజర్, హైరైడర్, ఇన్నోవా హైక్రాస్, ఇన్నోవా క్రిస్టా, ఫార్చ్యూనర్, హైలక్స్, ల్యాండ్ క్రూయిజర్ 300, క్యామ్రీ, వెల్‌ఫైర్ వంటి అన్ని మోడళ్ల ధరలు ఈ పెంపు పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వినియోగదారులపై కూడా తాజా ధరల పెంపు ప్రభావం పడనుందని కంపెనీ స్పష్టం చేసింది. కొత్తగా వాహనం కొనాలనుకునే వారు తాజా ధరల వివరాల కోసం డీలర్‌షిప్‌లను సంప్రదించాలని సూచించింది.

ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపు ధోరణి కొనసాగుతోంది. ఈ ఏడాది టయోటాతో పాటు టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా, ఆడి, బిఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, వోక్స్‌వ్యాగన్, స్కోడా వంటి పలువురు తయారీదారులు తమ వాహనాల ధరలను పెంచిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అంతర్జాతీయ మార్కెట్లలో ముడి సరుకుల ధరల మార్పులు దేశీయ ఆటో మార్కెట్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# బ్లాక్ స్వాన్ సమిట్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా ప్రభుత్వం గ్లోబల్ ఫైనాన్స్ అండ్ టెక్నాలజీ నెట్‌వర్క్ సహకారంతో భువనేశ్వర్‌లో నిర్వహించిన 'బ్లాక్ స్వాన్ సమిట్ - ఇండియా' కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల ఏర్పాటు, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించడం ఇవన్నీ మానవ మూలధనంలో పెట్టుబడులేనని అన్నారు. ఈ చర్యలు దేశ ఆర్థిక పురోగతికి దీర్ఘకాలిక బలమవుతాయని ఆమె పేర్కొన్నారు. భారత్ ఫిన్‌టెక్



ప్రయాణం కేవలం సాంకేతిక విజయగాథగానే కాకుండా, లింగ సమానత్వానికి దోహదపడిన కథగా కూడా గుర్తుండాలని రాష్ట్రపతి స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే ఆవిష్కరణలకు విస్తృత దృక్పథం వస్తుందని, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్ సాధిస్తున్న పురోగతి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్న రాష్ట్రపతి, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, సామాజిక న్యాయం ఈ మూడు సమన్వయంతోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

# గుర్నామ్ బోర్డర్ అవుట్‌పోస్ట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటన

- జమ్మూ–కాశ్మీర్‌లో భారత్–పాక్ సరిహద్దు సందర్శన
- కఠిన పరిస్థితుల్లో జవాన్ల సేవలకు ప్రశంసలు
- యువతకు దేశభక్తి, కర్తవ్యబోధకు ప్రేరణ
- జవాన్లతో ముఖాముఖి, గర్వం వ్యక్తం



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జమ్మూ-కాశ్మీర్‌లో భారత్-పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న గుర్నామ్ బోర్డర్ అవుట్‌పోస్ట్‌ను నేడు సందర్శించారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల మధ్య కూడా సరిహద్దుల రక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉంటూ దేశ భద్రతను కాపాడుతున్న జవాన్ల సేవలను ఆయన ప్రశంసించారు.

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, తీవ్రమైన వాతావరణం, సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ సైనికులు అంకితభావంతో విధులు నిర్వర్తించడం దేశానికి గర్వకారణమన్నారు. వారి త్యాగాలు, సేవలు ప్రతి యువతకు దేశం పట్ల కర్తవ్యబోధ, సేవాభావానికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. అవుట్‌పోస్ట్‌లో జవాన్లతో ముఖాముఖి మాట్లాడిన కేంద్ర మంత్రి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు రక్షణలో వారు ఎదుర్కొనే పరిస్థితులు, తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరాలు తెలుసుకుని అభినందనలు తెలిపారు. జవాన్ల ధైర్యసాహసాలు తనను గర్వంతో నింపాయని చెప్పారు.

దేశ సరిహద్దుల భద్రత కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న సైనికుల త్యాగాలు మరువలేనివని అమిత్ షా పేర్కొన్నారు. వారి సంకల్పం, సేవాభావంతోనే దేశ భద్రత మరింత పటిష్టంగా ఉందని వ్యాఖ్యానించారు.

# వ్యూహాత్మక నాయకత్వం, సమన్వయంతో సవాళ్లను ఎదుర్కోవాలి

## సేనాధిపతి ఉపేంద్ర ద్వివేది

భారత సేనాధిపతి ఉపేంద్ర ద్వివేది న్యూఢిల్లీలో నిర్వహించిన 'స్ట్రాటజిక్ లీడర్‌షిప్ పర్స్పెక్టివ్ ప్లానింగ్ ప్రోగ్రామ్' ఐదో ఎడిషన్‌లో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భారత సైన్యం, భారత వాయుసేన, భారత నౌకాదళంకు చెందిన సీనియర్ సైనికాధికారులతో పాటు రక్షణ మంత్రిత్వ శాఖలో కార్యదర్శి స్థాయి అధికారులు పాల్గొన్నారు. మారుతున్న భద్రతా పరిస్థితుల్లో వ్యూహాత్మక సమన్వయం, అనుకూలత అత్యంత కీలకమని సేనాధిపతి అన్నారు. అనిశ్చితి, సంక్లిష్టత,



వేగవంతమైన మార్పులతో కూడిన భద్రతా వాతావరణాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర దృక్పథం అవసరమని పేర్కొన్నారు. దీనిలో భాగంగా దౌత్య, సమాచార, సైనిక, ఆర్థిక అంశాల సమన్వయం, 'హోల్ ఆఫ్ నేషన్' విధానం, త్రివిధ దళాల సమిష్టి పని విధానం కీలకమని వివరించారు. సాంకేతిక స్వావలంబన, నిరంతర సామర్థ్యాభివృద్ధి ద్వారా దేశ రక్షణ బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సేనాధిపతి ప్రస్తావించారు. స్వదేశీ రక్షణ తయారీకి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆత్మనిర్భరత సాధ్యమవుతుందని చెప్పారు. ఈ దిశగా ముందుకు సాగితే అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సంయుక్తత, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక ప్రణాళికలు భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని సేనాధిపతి ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు.

# విద్య ప్రాముఖ్యతపై దృష్టి ఆకర్షణ : రాష్ట్రపతి

- సిమ్లిపాల్‌లో గిరిజన మహిళలు, యువతతో రాష్ట్రపతి మమేకం
- ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని సూచన
- దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు
- కష్టపడి ముందుకు సాగాలని ప్రోత్సాహం

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశాలోని సిమ్లిపాల్ ప్రాంతంలో గిరిజన మహిళలు, యువతతో ప్రత్యేకంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులు, విద్య, ఉపాధి అంశాలపై రాష్ట్రపతి చర్చించారు. రాష్ట్రపతి మాట్లాడుతూ విద్యే జీవితంలో మార్పుకు ప్రధాన సాధనమని స్పష్టం చేశారు. గిరిజన విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే మహిళలు, యువత కష్టపడి పనిచేస్తూ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్రపతి హితవు పలికారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో గిరిజన సమాజం కూడా క్రియాశీల పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. సిమ్లిపాల్ ప్రాంత గిరిజనులలో ఉన్న ప్రతిభ, శ్రమ దేశానికి బలమని పేర్కొన్న రాష్ట్రపతి, ప్రభుత్వం వారి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం గిరిజన సమాజంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని అధికారులు తెలిపారు.



# ఉత్తి గోడలు కాదు ఇళ్ళంటే.!

జన్మనిచ్చే తల్లి కూడా బిడ్డని మోసేది నవ మాసాలే కానీ ఇల్లు...
మనం బతికున్నంత కాలం మనల్ని మోస్తూనే వుంటుంది.

గుక్క పట్టి ఏడ్చినపుడు బిడ్డకి పాలిచ్చి లాలీ పాడే తల్లిలా ఇల్లు..
పొద్దంతా అలిసి వచ్చిన ఈ శరీరాన్ని తన ఒడిలోకి తీస్కొని సేద తీరుస్తుంది.

ఎన్నెన్ని కబుర్లు వింటుందో తెల్సా.. అసలేప్పుడు విసుక్కోకుండా..
తనకి నా గురించి అంత తెలుసు
ప్రేయసి మనసు తన ప్రియుడికి తెలిసినట్టుగా.

విచిత్రంగా అదేంటో మరి.. నేనెపుడు ఏమి చెప్పను
అయిన తనకి అన్ని తెలిసిపోతుంటాయ్..
బహుశా నేను బట్టలు మార్చుకునేటప్పుడు
నగ్నమైన నా హృదయానికేసి చూస్తుంది కాబోలు.

అసలేంత ఓపికో తనకి ఈ నేల తల్లికి మల్లే.
తనలో దాచుకున్న ప్రేమనంతా..
నిశబ్దంగా కురిపిస్తుంటుంది
కోపతాపాలనేంత చూపిన అన్నం మీద నేను అలిగి పడుకున్నా పాపం
పస్తున్నా నా కడుపుకేసి చూసి రోదిస్తుంటుంది.

రోజు రాత్రి .. తన గుండెకి నన్నత్తుకొని జోల పాడుతుంది
వాడిపోతున్నా నా ఆశల మీద కొన్ని నీళ్ళు జల్లి.. మళ్ళీ నన్ను నిలబెడుతుంది.

తను ఇచ్చిన భరోసా .. మరోసారి విఫలమైందని తెలిసిన
మళ్ళీ, మళ్ళీ.. రేపు నీదేనంటు... రెట్టిస్తుంది
కను తెరిచే లోపు ఉదయం ఒక ఆశ కిరణమై ముందు నిల్చుంటుంది.

లక్ష్యం వైపు నెడుతూ .. నిర్దాక్ష్యంగా నన్ను ఇంట్లోంచి మెడ బట్టుకు గేంటేస్తుందా..
సాయంత్రానికల్లా.. మళ్ళీ నా రాకకై ఇల్లంతా కళ్ళు చేసుకొని
రోడ్డుకేసి దీనంగా చూస్తుంది...

తనని తాకి పోయే గాలిని ..
నా గురించి ఆరా తీస్తుంది..
నే తిరిగోచ్చేంత వరకు ..
తప్పి పోయిన బిడ్డకి మల్లే ..
బోసి పోయి కూర్చుంటుంది.

చూసి.. చూసి ..
గడియారాన్ని గద్దిస్తుంది కాబోలు,
నే కనిపించడమే ఆలస్యం ..
తల్లి ఒడికి చేరిన కుక్క పిల్లలా
ఎంత సంతోషమో దానికి!!



దియా విఘ్నేష్



# భారత్–ఈయూ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం: జై శంకర్

కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ భారత్-ఈయూ ఫోరం ప్రారంభ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల భాగస్వామ్యానికి గేమ్‌చేంజర్‌గా మారిందని ఆయన పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంతో పాటు భద్రత, రక్షణ, వాతావరణ మార్పు, సాంకేతికత, ప్రతిభా మార్పిడులు వంటి రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని జై శంకర్ వివరించారు. ఈ అంశాలన్నింటిలో భారత్-ఈయూ సహకారం మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. భవిష్యత్‌లో గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్, ఈయూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, వ్యూహాత్మక అవగాహనతో ముందుకు సాగితే ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు.

భారత్-ఈయూ ఫోరం ద్వారా రెండు పక్షాల మధ్య మరింత చర్చలు జరిగి, అభిప్రాయ సమన్వయం పెరుగుతుందని జై శంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫోరం భాగస్వామ్యానికి కొత్త దిశను చూపుతుందని తెలిపారు.

# ఇస్లామాబాద్‌లో షియా మసీదుపై బాంబు దాడి

- 15 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు
- జుమ్మా ప్రార్థనల సమయంలో పేలుడు
- తర్లాయ్ కలాన్ ప్రాంతంలోని ఖదీజతుల్ కుబ్రా మసీదు లక్ష్యం
- ఆత్మాహుతి దాడి అనుమానం... రాజధానిలో భద్రత కట్టుదిట్టం

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో షియా మసీదును లక్ష్యంగా చేసుకుని జరిగిన భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని స్థానిక అధికారులు ధృవీకరించారు. ఇస్లామాబాద్ ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ పేలుడు చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనలకు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

ప్రాథమికంగా ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకున్నట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండిస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనకు ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో



జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. తాజా ఘటన నేపథ్యంలో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# నౌకలో భారత నేవీ అధికారి అదృశ్యం

సింగపూర్ నుంచి చైనాకు ప్రయాణిస్తున్న నౌకలో భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యాడు. ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రో గత ఏడాది జులైలో ఒక ప్రైవేటు షిప్పింగ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం అతడు ప్రయాణిస్తున్న నౌక సింగపూర్ నుంచి చైనాకు తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిబ్రవరి 2న సార్థక్ తల్లిదండ్రులు, స్నేహితులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మరుసటి రోజు నుంచి అతడితో సంప్రదింపులు పూర్తిగా నిలిచిపోయాయి. పలుమార్లు ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం సార్థక్ కనిపించడం లేదని సంబంధిత షిప్పింగ్ కంపెనీ కుటుంబ సభ్యులకు అధికారికంగా తెలియజేసింది. నౌకలో అతడి జాడ లేకపోవడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. నౌక సిబ్బంది, షిప్పింగ్ సంస్థతో పాటు సంబంధిత అధికారుల సహకారంతో అతడి కోసం శోధన కొనసాగుతోంది. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. తన కుమారుడిని సురక్షితంగా త్వరగా కనుగొని స్వదేశానికి తీసుకురావాలని సార్థక్ తల్లి భావోద్వేగ విజ్ఞప్తి చేశారు. ఘటనపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in